

# భవానీద్వీపం

- వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 60 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నీలికడలి రెండుగా చీలినట్లు, తిన్నగా పాపిట తీసి రెండుప్రక్కలా తళతళలాడే మెత్తని జుట్టును అందంగా దువ్వింది ఆమె. సౌందర్యరస ప్రవాహం అలలై ఎగసినట్లున్న పాపిటకు వేళ్ళాడుతున్న పాపిట బిళ్ళ ముద్దుగా వున్నది. బాల భానుడిని బంధించినట్లు ఎఱ్ఱని కెంపురాయి పొదిగిన పాపిట బిళ్ళ రమ్యంగా వున్నది. ఆ కెంపు కాంతులు వెదురు కొనలాంటి ముక్కుమీద ప్రతిఫలిస్తూ మురిపెంగా ముసిముసి నవ్వులు చిందుతున్న పెదాల కాంతులలో కలిసి కరిగిపోతున్నాయి. సన్నని సరసమైన గొంతు తాపంతో తను గుటకలు మింగుతుంటే స్ఫటికంలా మెరుస్తున్నది. తపనగా పైకి లేచిన ముఖం పున్నమి చంద్రుడిలా వున్నది. తహ తహతో విచ్చుకున్న ఎఱ్ఱని పెదవులు ఎఱ్రగా పండిన నారింజ తొనలలా ఉన్నాయి. గుండ్రంగా నిగనిగ లాడుతున్న బొద్దైన గడ్డం అద్దమంటి ముఖానికి అమరిన ముద్దైన పిడిలా ఉన్నది.

ఆమె అనుకుని వున్న పొన్నచెట్టును చుట్టి వెనక్కు పైకి లేచిన బాహువులు ఆ చెట్టును చుట్టుకున్న లతల్లా వున్నాయి. సాయంకాలపు చల్లని గాలులకు నెమ్మది నెమ్మదిగా పవిట జారి నేలకు వాలిపోయింది.

బిగువైన రవిక దాచలేనట్లుగా పొంగుతున్న వక్షోజాలు అమృతాన్ని నింపుకున్న బంగారు కలశాలలా వున్నాయి. సన్నని నడుమున్నది. ఉన్నదో లేదో తెలియని ఉదరం మీద అందంగా లతలా పైకి పాకుతున్న రోమరాజి తళుకులీనుతున్నది. ఆ రోమలత, దానికి మన్మథుడు చేసిన పాదులా లోతైన నాజూకైన నాభి కనులున్నందుకు ఫలాల్లా వున్నాయి.

కుడిపాదం మీదుగా చాచిన ఎడమపాదంతో నిలవలేనట్లుగా నేలను రాస్తున్నది. గాలికి ఎగిరిపడుతూ ఒంటికి అంటుకుపోయిన తెల్లని చీర వెన్నెల కెరటంలా వున్నది, మీగడ తరగలా వున్నది, కోడె త్రాచు విడుస్తున్న కుబుసంలా వున్నది. బంగారు రంగులో వున్న ఏనుగు తొండాలలా బలమైన తొడలు ఎంతటి బలవంతులనూ బానిసలు చేసేట్లున్నాయి. మనసుకు వెఱ్ఱి పుట్టేలా వున్న మోకాటి చిప్పలు రతీ మన్మథుల కిరీటాలలా వున్నాయి. మత్తెక్కించే పిక్కలు మన్మథుడి అమ్ముల పొదులలా వున్నాయి.

కాలిబాటకు ఆనుకుని వున్న పొన్నచెట్టుకు చేరగిలబడి వున్న ఆ సుందరిని అల్లంత దూరంనుండే చూస్తూ గంభీరంగా అడుగులేస్తున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు. పొద్దుతిరుగుడు పూవులా ఆమె ముఖం అతడినే చూస్తూ నెమ్మదిగా అతడిని అనుసరించి తిరుగుతున్నది. అంతకంతకూ ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వేగమవుతున్నాయి. తీగలాంటి ఆమె శరీరం సన్నగా కంపించిపోతున్నది. తడారిపోతున్న పెదాలను తడపడానికేమో లేత గులాబీ రెక్కలాంటి నాలుక తపన పడుతున్నది. ఆమె తపనను బయటపెడుతున్నది.

తన ముందునుండి క్రీగంట తనను చూస్తూ అతడు దాటి పోతుంటే నిరాశగా వెలువడిన నిట్టూర్పు బుసలా వినిపించింది.

ఓరగంట ఆమెను గమనిస్తూ తొట్రుపాటు లేకుండా వడిగా ముందుకు నడిచాడు శ్రీవిద్యాపూర్ణుడు. ఇక తట్టుకోలేనట్లుగా అతడిని పెనవేసుకోవాలనే కోరికతో ముందుకు దూకబోయింది ఆమె. వెండి పొన్ను తొడిగిన చేతికర్రను ఆమెవైపు చాచాడు అతడు, అక్కడే ఆగు అని హెచ్చరిస్తున్నట్లు. మంత్రం వేసినట్లు ఉన్నచోటే ఆగిపోయిందామె. చెట్లూ పొదలూ కొండరాళ్ళమధ్య కాలిబాట మీద అతడు కనుమరుగైనాడు. ఆర్తిగా చేతులు చాచి దీనంగా అతడు వెళ్ళినవైపే చూడ సాగింది ఆమె.

యింతలోనే ఎప్పుడు వచ్చాడో ఎటునుండి వచ్చాడో దృఢకాయుడొకడు ఆమె చేతులను ఒడిసిపట్టుకున్నాడు.

తళతళలాడుతున్న నల్లరాతి శిల్పంలా ఎత్తుగా బలంగా వున్నాడతడు. విసురుగా తనమీదకు లాక్కుని తన బాహుబంధంలో ఆమెను బిగించాడు. నిండుపున్నమి చంద్రుడిని నీలిమబ్బులా కమ్ముకున్నాడు ఆమెను. విలవిలలాడుతూ పెనగులాడింది ఆమె. అంతకంతకూ ఆమెను బలంగా చుట్టుకుంటున్నాయి అతడి బాహువులు.

శరీరంలోని బలమంతా ఉపయోగించి ఒక్క వుదుటున అతడిని విదిలించుకుంది. ఆ వుదుటుకు తూలి పక్కకు పడి మళ్ళీ నల్లత్రాచులా సర్రున పైకి లేచాడతడు. తనూ తూలి నిలదొక్కుకోడానికి ప్రయత్నించింది ఆమె. పొదలు కాళ్ళకు అడ్డుపడి ఆమె ప్రయత్నం విఫలమైంది. విసురుగా పక్కకు పడిపోయింది. అడవి తీగలు, పొదల మధ్యనున్న గండశిలపై విసిరి కొట్టినట్లు పడిపోయింది. అద్దంలాంటి అందమైన నుదురు బలంగా శిలకు తాకింది. టప్పున కొబ్బరికాయ పగిలినట్లు ధ్వని వినిపించింది.

చప్పున లేచికూర్చున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు. శరీరమంతా చెమటలతో తడిసిపోయింది. కిటికీలోనుండి బయటకు చూశాడు. యింకా పూర్తిగా తెలవారలేదు. వెన్నెల మసకబారింది. మరొక ఘడియలో సూర్యోదయం అవుతుంది బహుశా. ఉత్తరీయంతో చెమటలు అద్దుకుంటూ ఆలోచనలో పడిపోయాడు.

క్రితం పౌర్ణమినాడు కాళికాలయంలో రెండు త్రాచులు కలబడి, ఒకటి విభూతి మీద లిఖించిన బీజాక్షర యంత్రాన్ని భగ్నం చేసినతర్వాత మరలా ఏ సర్పమూ కనబడలేదు. కానీ అతడి మనసుకు తెలుసు, ఏం జరగబోతున్నదో. ఒక పదిహేను రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. పౌర్ణమి వెళ్లి, కృష్ణపక్షం గడిచిపోయింది.

గత పక్షం రోజులుగా కాళికాలయానికి వెళ్తూన్నప్పుడు, పూజ ముగించుకుని తిరిగివచ్చేప్పుడు ఆ అందమైన యువతి అచ్చు కలలో కనిపించినట్లే కనిపిస్తూనే వున్నది. తను గమనించీ గమనించనట్లు అలా వెళ్లిపోతూనే వున్నాడు. తన వెనుకే పొదలు, చెట్ల మాటుగా తనను అనుసరించి ఇంటిదాకా వస్తున్నట్లు తనకు తెలుస్తూనే వున్నది. తను వెనుతిరిగి చూడలేదు ఏనాడూ. చూడాల్సిన అవసరం లేదు.

ఆమె ఎవరో, ఆమెకేం కావాలో, ఎందుకు తనను కవ్విస్తూ వెంబడిస్తున్నదో తనకు తెలుసు. పగలు కనిపించి కవ్వించినట్లే రాత్రి కలలలోనూ వెంటబడుతున్నది ఆమె. కానీ ఈ రోజు దిగ్భ్రాంతికరమైన స్వప్నం! అద్దం భళ్ళున పగిలినట్లు, అందమైన అద్దంలాంటి నుదురు ఆ రాతికి కొట్టుకుని, కొబ్బరికాయ విచ్చినట్లు ఆ ధ్వని గుర్తుకు వచ్చి ఒక్కసారి ఒళ్ళు జలదరించింది శ్రీవిద్యాపూర్ణుడికి. ఒక్క క్షణంపాటు మనసులో ఏదో అనుమానం కలిగింది. చివాలున లేచాడు. చమురు దీపాన్ని అందుకుని, పూజాగృహం తలుపులు తెరిచాడు.

దీపపు కాంతిలో చిరునవ్వులు చిందిస్తూ పూజామందిరంలో జగజ్జనని మూర్తి కనిపించింది. ఆ దివ్యమూర్తినే చూస్తూ క్షణకాలం నిలబడిపోయాడు. వెనుదిరిగాడు. రాగిచెంబులో రాత్రి ఉంచుకున్న నీటిని ముమ్మారు

పుక్కిలించి దంత ప్రక్షాళన చేసుకున్నాడు. మూలనున్న చేతికర్రను అందుకున్నాడు. అలికిడికి లేచిన తల్లిదండ్రులు ప్రశ్నార్థకంగా చూస్తుండగా తలుపులు చేరవేసి బయటకు నడిచాడు.

వడి వడిగా అడుగులేస్తూ ముందుకు నడిచాడు. కావలి వాళ్ళు వినయంగా నమస్కరిస్తుండగా నగరప్రవేశ ద్వారాన్ని దాటాడు. పొలిమేరలలో వున్న కాళికాలయం వైపు నడిచాడు. చెట్లు, పొదలు, బండరాళ్ల మధ్యగా కాలిబాట మీద నడుస్తూ, మలుపు తిరిగి, రోజూ ఆమె కనబడే ప్రాంతానికి దగ్గరవుతున్నకొద్దీ ఆయన మనసులో ఒక ఉద్విగ్నత కలుగసాగింది. ఆ పొన్న చెట్టు కనబడింది. గుండె వేగం పెరిగింది. సమీపించి, కాలిబాట మీదే ఆగిపోయి దృష్టి సారించాడు. 'అమ్మా! జగజ్జననీ!' అన్న ఆక్రందన అప్రయత్నంగా వెలువడింది ఆయన నోటివెంట.

పొన్నచెట్టుకు కుడివైపున పొదలమధ్యన తెల్లని పట్టుకుచ్చులు ఎగురుతున్నట్లు మెలికలు తిరుగుతూ కనిపించినవైపు అడుగులేశాడు. అక్కడ, పొదల మధ్యన, నేలకు రెండు మూరల ఎత్తునున్న గండశిలపై ఎఱ్ఱని రక్తం అంటుకుని వున్నది. తల ఛిద్రమై, రక్తాన్ని చిమ్ముతూ, మెలికలు తిరుగుతూ పొర్లుతున్నది రెండు నిలువుల పొడవున్న గోధుమవన్నె త్రాచు. మరణానికి దగ్గరలో ఉన్నది ఆ దివ్యసర్పం. ఆ స్థితిలో కూడా అడుగుల చప్పుడు, నేలకు తాటించిన కర్ర చప్పుడు విని, నెత్తుటి ముద్దగా మారిన తలను తిప్పి విద్యాపూర్ణుడిని చూసింది. ఆ నీలి కనులు క్షణకాలం మెరిసినట్లు కనిపించాయి. నీటి బుడగలా లిప్తపాటు పడగ తెరుచుకున్నది. అంతే. తలవాల్చింది. క్రమ క్రమంగా ఒక్క తోక తప్ప మిగిలిన శరీరం పూర్తిగా నిశ్చలమైపోయింది. చిరుగాలికి జవరాలిపైటలా నెమ్మదిగా కదిలిన తోక కూడా ఆగిపోయింది. ఆయన మీదే చూపులు నిలిపి ప్రాణాలు వదిలింది ఆ దివ్యసర్పం.

గుండెలు మెలిపెట్టినట్లు బాధకలిగింది శ్రీవిద్యాపూర్ణుడికి. కనులవెంట నీరు తిరిగింది. ఏమిటీ విధి పరీక్ష! ఎందుకీ మూగప్రాణికి ఈ ఘోరమైన శిక్ష? కొంతసేపు రకరకాల భావాలతో సతమతమైన తర్వాత ఒక ఆలోచన కలిగింది ఆయనకు. రెండడుగులు ముందుకు వేసి చనిపోయిన సర్పాన్ని సమీపిస్తుండగా చెవులు చిల్లులు పడేలా బుస్సుమంటూ రెండున్నర నిలువుల నల్లని కెరటంలా పైకి లేచింది ఆ గండశిల మాటునుండి అప్పటిదాకా గమనిస్తున్న నల్లత్రాచు. తీవ్రమైన కోపంతో నాలుకలు సాచి వూగిపోయింది. యేమాత్రమూ తొణకకుండా, చేతికర్రను దానివైపు సాచాడు. బీజాక్షరాలు లిఖించిన వెండిపొన్ను చుట్టిన కర్ర అది. ఒక మంత్రదండానికున్న శక్తి ఉన్నది ఆ బీజాక్షర సంపుటీకరణ కారణంగా.

బుస్సుమంటూ నిలువునా నేలకు దబ్బున జారిపోయింది ఆ నల్లత్రాచు. దానిని ఏమాత్రమూ పట్టించుకోలేదు విద్యాపూర్ణుడు. పొన్నచెట్టునుండి బలమైన కొమ్మను ఒకదాన్ని విరిచి ఆ కొమ్మతో చనిపోయిన సర్పాన్ని ఎత్తిపట్టి వెనుదిరుగుతుండగా మరలా క్రోధంగా బుసలు కొడుతూ పడగ ఎత్తి ముందుకు దూకడానికి ప్రయత్నం చేసింది నల్లత్రాచు. 'హ్రీం సర్ప సర్ప మం' అన్న బీజాక్షరాలు నిర్దిష్టమైన స్థానాలలో కూర్చబడిన మంత్రం ఒకటి నిర్దిష్టమైన

స్వరంతో ఉచ్చరిస్తూ నేలమీద మూడు గీతలు గీశాడు. విచిత్రం! వెనక్కు వెనక్కు పాకుతూ వెళ్ళింది ఆ నల్లత్రాచు. మూడుకాలాలలో, పగలు – రాత్రి – సంధ్యలలో ఆయన అడుగులు పడిన చాయలకు కూడా రాకుండా చేసిన మంత్రకట్టు అది. నిట్టూరుస్తూ వెనుదిరిగి ఇంటివైపు అడుగులేశాడు. ఆయన వెళ్ళినవైపే చూస్తూ కోపంతో బస్సున పడగను బలంగా నేలకు చరిచి, నల్లని మెరుపులా పొదలలో అదృశ్యమై పోయింది నల్లత్రాచు.

★★★★★★★★★★★★★★★★

'కాళికాలయంలో బీజాక్షర మంత్రం లిఖించిన విభూతి కారణంగా శ్రీవిద్యాపూర్ణుడిపై మోహంలో పడింది ఆ తక్షక సర్పం. ఆ మోహం తీర్చుకోడానికే వెర్రిగా ఆయన వెంటపడింది. బలవంతంగా తనను పొందడానికి ప్రయత్నించిన మగత్రాచుకు దూరమైంది. ఆ కారణంగా మరింత కసితో, ఆయనమీద పగతో వెంటబడింది మగత్రాచు. శ్రీవిద్యాపూర్ణుడి మంత్ర శక్తి కారణంగా ఆయనను సమీపించలేనని, పొందలేనని విరక్తితో తలను గండశిలపై మోదుకుని ఆత్మత్యాగం చేసింది ఆ ఆడత్రాచు. తన స్వప్నం చేసిన సూచనతో ఏమైందో గ్రహించి పరుగునా వెళ్ళిన విద్యాపూర్ణుడు తన స్వహస్తాలతో ఆ ఆడత్రాచుకు అగ్నితో అంతిమ సంస్కారం చేశాడు' జరిగినదంతా మంద్ర స్వరంతో ఒక కథలా చెబుతున్నాడు భాస్కరాచార్యులవారు.

నమ్మలేనట్లుగా ఊపిరి బిగబట్టి వింటున్నారు అక్కుభొట్లు, లక్ష్మీధరుడు. లక్ష్మీధరుడి మనసులో రకరకాల అనుమానాలు ఎండమావుల్లా తళుక్కుమని మాయమవుతున్నాయి. గమనించాడు భాస్కరాచార్యులవారు. 'ఊహకందని సత్యాలెన్నో సృష్టిలో వున్నాయి లక్ష్మీధరా! నిన్ను కామించి వెంబడించిన సర్పం నీకు సత్యంగా కనిపించింది, నీకు అనుభవం జరిగింది కనుక! ఈ జన్మలో అనుభవాలు నీకు గుర్తున్నాయి. నీకు నేను చూపించింది నీ పూర్వజన్మలో అనుభవం!'

'స్వామీ!' అన్నాడు లక్ష్మీధరుడు ఉలికిపాటుతో, సంభ్రమంగా.

'అవును లక్ష్మీధరా! జన్మజన్మలుగా నిన్ను అనుసరించి పుడుతూనే ఉన్నది ఆ దేవజాతి సర్పం. ఆ నాగకన్యను వెన్నాడుతూనే వున్నది, మగ సర్పం. ఇది జన్మజన్మల పరంపర. గాలికి రేగిన పుప్పొడి రేణువు ఎక్కడో వాలుతుంది. వాలిన దగ్గర మరలా మొలకెత్తుతుంది. చిగురుస్తుంది. పుష్పించి వికసిస్తుంది. ఆ పుప్పొడి రేణువు మరలా ఏ చిరుగాలికో, సుడిగాలికో ఎగిరి ఎక్కడో మరలా కొనసాగుతుంది. పూర్వజన్మల బంధాల వాసనలు పుప్పొడి రేణువులే! ఆ రేణువుకూడా లేకుండా నశించిన నాడు పూవు శాశ్వతంగా ఎండిపొయినట్లు!'

మరలా ఏదో అలౌకిక ప్రపంచంలోకి వెళ్ళినవాడిలా వింటున్నాడు లక్ష్మీధరుడు. మౌనంగా తన ఆరాధ్యదైవం జమలాపురీశుడిని మధ్య మధ్యన సంభ్రమంతో, తత్తరపాటుతో, భయంతో స్మరించుకుంటూ వింటున్నాడు అక్కుభొట్లు.

జన్మ జన్మల కథలకు 'ఊ..' కొడుతున్నట్లుగా మోగుతున్నాయి కాశీవిశ్వేశ్వరుడి గుడిలో గంటలు. ఆశ్చర్యంతో 'అంబా'రావాలు పలుకుతున్నట్లుగా గోవుల సడులు, వృషభాల రంకెలు వినిపిస్తున్నాయి. వింటున్నవాళ్ళు అబ్బురంగా గుసగుసలాడుతున్నట్లు సన్నని ధ్వనులతో గంగాతీరంనుండి వీస్తున్న చల్లగాలులు మెల్లగా సవ్వడి చేస్తున్నాయి. నదిపై పడవల వాళ్ళ పాటలు కథకు సంగీతాన్ని అందిస్తున్నట్లుగా, సంగతులు వేస్తున్నట్లుగా వున్నాయి! కథలేవైనా కంచికో, కాకుంటే కాశికో అన్నట్లు చిద్విలాసంగా విశాలాక్షీ విశ్వేశ్వరులూ వింటున్నట్లున్నారు!

★★★★★★★★★★★★★★★★★★

కృష్ణమ్మ పరుగులాపి తృష్ణతో వింటున్నది. ఉండీ ఉండీ ఒకచోటనుండి మరొకచోటికి ఎగురుతున్న నీటిపక్షుల రెక్కలు కరతాళ ధ్వనులు చేస్తున్నట్లుగా ఉన్నాయి. భవానీద్వీపం 'భళీ' అంటున్నట్లు ద్వీపం తీరాన్ని తాకుతున్న కృష్ణమ్మ అలలు ఛెళ్ళున మోగుతున్నాయి. దూరంనుండి క్రూరమృగాల అలజడులు ఆశ్చర్యంతో కూడిన అరుపులలా ఉన్నాయి.

'ప్రవాహంలో అలల లాగ కాలప్రవాహంలో పుటకలు కృష్ణోబా! ప్రతి అలకూ మరొక అల కారణము, ఫలితమూ అవుతుంది! నువ్వు చూసిన కాలసర్పం అనేక జన్మలుగా నిన్ను వెన్నాడుతూనే వున్నది. ఎన్నోమార్లు నాతో ప్రస్తావించబోయి ఆగిపోయావు. సమయం రావాలి నీకు అంతా చెప్పాలి, చూపించాలి అని ఆగిపోయాను.' సమర్థ రాముడి కంఠం కలలో వినిపించినట్లు చెవులకు సోకుతున్నది కృష్ణరాయలకు.

'విద్యాపూర్ణుడితో మొదలైన కథ నాగుమయ్య, కృష్ణమాచార్యులు, లక్ష్మీ ధరుడు. కృష్ణరాయలతో కొనసాగింది! సంపంగిగా, మోహనాంగిగా, తక్షక నాగకన్యగా ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క రూపంతో అనుసరించి వస్తూనే వున్నది నాగకన్య. ఏదో ఒక రూపంలో ఆమెనూ నిన్నూ వెన్నాడుతూనే వున్నది మగసర్పం.' ఈ కథ యింకొన్ని జన్మలు కొనసాగుతుంది కృష్ణోబా! ఇక్కడే, ఈ భవానీ ద్వీపంలోనే కథ అంతమవుతుంది!' అని మౌనం వహించాడు సమర్థరాముడు. కొద్ది దూరంలో ఎక్కడో సింహగర్జన భవానీద్వీపం అంతా మారుమ్రోగేలా వినిపించింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS